క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఐటీ విభాగ కార్యదర్శి గౌతమ్‌కు సత్కారం



గౌతమ్‌ను సత్కరించిన సామంతకుర్రు గ్రామస్తులు

అల్లవరం: వైఎస్సార్ సీపీ ఐటీ విభాగ జిల్లా కార్యదర్శిగా నియమితులైన కొల్లు గౌతమ్‌ని సామంతకుర్రు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మాజీ సర్పంచ్ కొప్పాడి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఆదివారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. గౌతమ్‌కి సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఐటీ విభాగ అధ్యక్షులు తోరం గౌతమ్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొల్లు ఏడుకొండలు, పెసింగ్ శ్రీను, అంగాడి వీర బ్రహ్మం పాల్గొన్నారు.

మాతా కామాఖ్యదేవి, కాలభైరవ విగ్రహాల బహూకరణ



అక్షయ పాత్ర సంస్థకు బహూకరించిన కామాఖ్య దేవి, కాలభైరవ విగ్రహాలు

అమలాపురం టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన మార్నీడి సూర్యనారాయణ, సత్యవతి దంపతులు రూ.60 వేల విలువైన మాతా కామాఖ్యదేవి, కాలభైరవ లోహపు విగ్రహాలను స్థానిక విద్యుత్‌నగర్‌లోని అక్షయ పాత్రకు ఆదివారం బహూకరించారు. పుష్య మాస బహుళ అష్టమిని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కామాఖ్యదేవి అఖండ హోమ పూర్ణాహుతి జరుగుతుందని శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ప్రతినిధి సలాది సాయిరాం తెలిపారు.

దళిత సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



ముమ్మిడివరంలో సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముమ్మిడివరం: ఈ నెల 11న రాజమండ్రిలో మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆధ్వర్యంలో జరిగే దళిత సింహ గర్జన సభకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో దళిత సంఘాల నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. అధిక సంఖ్యలో అభిమానులు హాజరై సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెల్లి అశోక్, బడుగు జేమ్స్ పాల్, దుక్కిపాటి సత్యనారాయణ, వెంట్రు సుధీర్, దడాల బుజ్జిబాబు, మెండి కృష్ణబాబు, కాశి లాజర్, గుంట్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ శివాళిని దంపతులకు సత్కారం



సర్పంచ్ శివాళిని దంపతులను సత్కరిస్తున్న ఇందుపల్లి గ్రామస్తులు

అమలాపురం రూరల్: వివేకానంద సంఘమిత్ర జాతీయ ప్రతిభ పురస్కారం అందుకున్న ఇందుపల్లి సర్పంచ్ చొల్లంగి శివాళిని, అప్పాజీ దంపతులను గ్రామ పెద్దలు స్థానిక బీసీ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉర్రింకి బుజ్జి, ఎంపీటీసీ కొరిమిల్లి రాంబాబు, మల్లుల పోలయ్య, ఆకెళ్ల నారాయణమూర్తి, మల్లుల రామకృష్ణ, డాక్టర్ శ్రీపాద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పెయింటింగ్

అమలాపురం రూరల్: బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఆంధ్రలో ఒకసారి, కేంద్రంలో మరోసారి బీజేపీ సర్కార్ అనే నినాదంతో యువ మోర్చా అధ్యక్షుడు ఈశ్వర్‌గౌడ్ అమలాపురంలో ఆదివారం వాల్ పెయింటింగ్ వేయించారు. కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు విచ్చేసి గోడ పెయింటింగ్‌లను పరిశీలించారు.

నూతన కార్యవర్గం ఎంపిక

సఖినేటిపల్లి: మోరి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఎస్టీయూ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్టీయూ సంఘ మండల నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. మండల గౌరవ అధ్యక్షుడిగా కడలి వెంకట నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా గుబ్బల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శిగా ఉండపల్లి గిరిబాబులను ఎన్నుకున్నారు. అలాగే మండల మహిళా అధ్యక్షురాలుగా ఎండీ బషీరా బేగంను ఎన్నుకున్నారు. వీరితో పాటు ఆర్థిక కార్యదర్శిగా గేదెల వీవీ కృష్ణ ప్రసాద్, ఇతర విభాగాల కన్వీనర్లుగా కంచి నాగరాజు, జెట్టి వీర్రాజులను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా నరహరిశెట్టి సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

పదింతల ప్రణాళిక

- పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు
- జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియళ్ల పంపిణీ
- ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ



గొల్లవిల్లిలో విద్యాభారతి మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు చేపట్టారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో జిల్లా పరిషత్ సౌజన్యంతో జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియళ్లను అందించారు. ఆయా పాఠ్యాంశాలపై బాగా పట్టున్న ఉపాధ్యాయులను గుర్తించి వారి సహకారంతో స్టడీ మెటీరియల్ పుస్తకాలను రూపొందించారు. ప్రతి విద్యార్థికి సులభంగా అర్థమయ్యేలా ఇంగ్లిష్ మీడియం వారికి ఇంగ్లిష్‌లో, తెలుగు మీడియం వారికి తెలుగులోనూ పుస్తకాలను సిద్ధం చేసి అందించారు.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని పాఠశాలలన్నింట్లో కలిపి మొత్తంగా 6,379 స్టడీ మెటీరియళ్లను అందించారు. ప్రతి పాఠ్యాంశంలోనూ మునుపటి పేపర్‌లు, సాధన పేపర్లు ఉంటాయి. వెనుకబడిన విద్యార్థులు మునుపటి సంవత్సరాల పరీక్ష పేపర్లు శ్రద్ధగా సాధన చేస్తే 60 నుంచి 70 శాతం మార్కులు సాధించవచ్చని సీనియర్ ఉపాధ్యాయులు చెబుతున్నారు. అదే విధంగా చురుగ్గా అర్థం చేసుకునే విద్యార్థులైతే సాధన పేపర్లపై పట్టు సాధిస్తే మెరుగైన మార్కులు సాధించవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. పరీక్షల సమయం దగ్గర పడటంతో రోజూ ఉదయం 45 నిమిషాలు, సాయంత్రం 45 నిమిషాలు ప్రత్యేక తరగతులు నిర్వహించేలా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే పరీక్షలకు సమయం దగ్గర పడటంతో ఉపాధ్యాయులు రోజుకొక పాఠ్యాంశంపై విద్యార్థులను చదివించడంతో పాటు వారాంతపు పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు సదస్సులు ఏర్పాటుచేసి అవగాహన కల్పిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అందించిన స్టడీ మెటీరియల్స్ వివరాలు

మండలం	అందించిన మెటీరియల్స్
అమలాపురం	2083
ముమ్మిడివరం	789
అల్లవరం	631
ఉప్పలగుప్తం	586
తాళ్లరేవు	1129
ఐ.పోలవరం	618
కాట్రేనికోన	543

ప్రతి విద్యార్థికి అందించాం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాభారతి మెటీరియల్స్‌ను అందించాం. వెనుకబడిన విద్యార్థులు ఉన్న కొద్దిపాటి సమయాన్ని సద్వినియోగం చేసుకుని సాధన చేసినా మెరుగైన ఫలితాలు సాధించొచ్చు. ప్రతిఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలని ప్రత్యేక తరగతులు నిర్వహించేలా ఉపాధ్యాయులకు మార్గనిర్దేశకాలు జారీచేశాం

– కె.కిరణ్‌బాబు, విద్యాశాఖాధికారి, ఉప్పలగుప్తం మండలం

మెరుగైన ఫలితాలు సాధించవచ్చు



ఇప్పటికే మా పాఠశాలలో సిలబస్ పూర్తయింది. జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్స్ ఇటీవలే మాకు అందించారు. ప్రతి సబ్జెక్టు సులభంగా అర్థమయ్యేలా వాటిని రూపొందించారు. వాటి ద్వారా మేము మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నమ్మకం కలిగింది.

– అక్కల బిందు శరణ్య, పదో తరగతి విద్యార్థిని, గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ఉప్పలగుప్తం మండలం

స్టడీ మెటీరియల్‌తో ఎంతో ఉపయోగం



విద్యాభారతి మెటీరియళ్లను వెనుకబడిన విద్యార్థికి సైతం అర్థమయ్యేలా రూపొందించారు. దీంట్లో ఉన్న సాధన పేపర్‌లు చాలా ఉపయోగపడుతున్నాయి. ఫైనల్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.

– దంగేటి విష్ణు నాగసాయి, పదో తరగతి విద్యార్థి, దేవగుప్తం జెడ్పీ ఉన్నత పాఠశాల, అల్లవరం మండలం

పక్కా ప్రణాళికతో రూపొందించారు



విద్యాభారతి మెటీరియల్‌లో ప్రతి సబ్జెక్ట్ పక్కా ప్రణాళికతో రూపొందించారు. మూడు భాషలు, మూడు సబ్జెక్ట్‌లు అందరికీ ఉపయోగకరంగా నిపుణులతో రూపొందించారు. స్టడీ మెటీరియల్ సాధన చేస్తే చదువులో వెనుకబడుతున్న విద్యార్థులు సైతం ప్రతి సబ్జెక్ట్‌లోనూ 75 వరకూ మార్కులు తెచ్చుకోవచ్చు. దీని ఆధారంగానే రివ్యూ టెస్ట్‌లు పెడుతున్నాం. ఈ నెల 12 నుంచి 17 వరకూ గ్రాండ్ టెస్ట్‌లు సైతం విద్యాభారతి ఆధారంగానే నిర్వహిస్తాం.

– ఒ.జగపతి, సీనియర్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, చెయ్యేరు, కాట్రేనికోన మండలం

పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: నియోజకవర్గం నుంచి భారీగా తరలి వెళ్లి దెందులూరులో జరిగిన సిద్ధం సభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఆదివారం ముమ్మిడివరంలో విలేకర్లతో మాట్లాడుతూ సిద్ధం ఎన్నికల సన్నాహక సభకు జన సునామీ పోటెత్తిందన్నారు. వెల్లువలా తరలివెళ్లిన పార్టీ శ్రేణులతో సభ కిక్కిరిసిపోయిందన్నారు. తమ జనహృదయ నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారన్నారు. సభకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు అసౌకర్యం కలగకుండా తాగునీరు, మజ్జిగ, ఆహార పొట్లాలు అందించిన నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చెట్టు పైనుంచి జారి పడి వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వరరావు

అల్లవరం: మండలంలోని దేవగుప్తం పంచాయతీ పరిధిలోని నల్లగుంటలో కొబ్బరి చెట్టు పైకి ఎక్కి బొండాలు తీస్తున్న క్రమంలో ఎంట్రుకోన గ్రామానికి చెందిన తిక్కిరెడ్డి ఈశ్వరరావు ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. ప్రమాదంలో ఈశ్వరరావు వెన్నుపూసకు తీవ్ర గాయమైంది. స్థానికులు, కుటుంబీకులు స్పందించి అంబులెన్స్‌లో అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొబ్బరి బొండాల వ్యాపారం చేసుకునే ఈశ్వరరావు జీవనోపాధి కోల్పోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అమరేశ్వరరావుకు పురస్కారం



ఉండవల్లి అరుణ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అమరేశ్వరరావు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన అద్దంకి అమరేశ్వరరావుకు కళాతపస్వి కె.విశ్వనాథ్ స్మారక సేవా ప్రశంసా పురస్కారం లభించింది. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, జిత్‌మోహన్ మిత్ర బృందం చేతుల మీదుగా రాజమహేంద్రవరంలో అవార్డు తీసుకున్నట్టు అమరేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజుతో పాటు పలువురు అభినందించారు.

రైతుల సంక్షేమమే సొసైటీల ధ్యేయం

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ఎమ్మెల్యే పొన్నాడను సత్కరిస్తున్న సొసైటీ అధ్యక్షులు

ఐ.పోలవరం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాలు పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మురమళ్ల వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే పొన్నాడను మండలంలోని సహకార సంఘ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఎస్.నాగబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్తరాణి మిరియాం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్ రాజు, ధూళిపూడి చక్రం, పెన్మత్స వాసురాజు, కాలే రాజబాబు, పిన్నంరాజు వెంకటపతిరాజు, సొసైటీ అధ్యక్షులు కడియం తమ్మయ్య, వి.శ్రీనివాసరావు, మెండా వెంకన్నబాబు, ముదునూరి వరహాలరాజు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తిస్తే చికిత్స సులభతరం



ఆరోగ్య సదస్సులో వైద్యులను సత్కరిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తిస్తే రోగికి చికిత్స సులభతరంగా ఉంటుందని పట్టణానికి చెందిన క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ యెనుముల నరసింహరావు అన్నారు. ఆదివారం అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చంద్రబాబు ఆరోగ్య ఉద్యాన వనం (పార్కు)లో జరిగిన ఆరోగ్య సదస్సులో డాక్టర్ నరసింహరావు, డాక్టర్ బి.రాఘవేంద్రరావు, డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి ‘ఆదిలోనే క్యాన్సర్‌ను గుర్తించడం ఎలా?’ అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యులను క్లబ్ తరఫున ఘనంగా సత్కరించారు. సదస్సులో వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్య వరప్రసాద్, క్లబ్ కార్యదర్శి వలవల వెంకటరెడ్డి నాయుడు, కోశాధికారి పచ్చి గోళ్ల రాజా, వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, క్లబ్ ఉపాధ్యక్షుడు రంకిరెడ్డి కాశి పాల్గొన్నారు.

చక్రవాకం పుస్తకావిష్కరణ



చక్రవాకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, సాహితీవేత్తలు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ముక్కామల చక్రధర్ రచించిన చక్రవాకం పుస్తకాన్ని స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఆవిష్కరించారు. కవి ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభకు జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంత వైస్ చాన్సలర్ ఆచార్య పి.కుసుమకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. చక్రధర్ జర్నలిస్ట్‌గానే కాకుండా ఓ రచయితగా, కవిగా అమలాపురం విశిష్టత, కోనసీమ ప్రాచుర్యాన్ని ఇనుమడింపచేసేలా పుస్తకాలు రాయడం అభినందనీయమన్నారు. అనంతరం చక్రవాకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి శ్వేత డైరెక్టర్ భూమాన్, సీతారామ్, అద్దేపల్లి ప్రభు, పెమ్మరాజు గోపాలకృష్ణ, డాక్టర్ కాళ్లకూరి శైలజ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్రీపల్లవికి సత్కారం



తహసీల్దార్ పరమట శ్రీపల్లవిని సత్కరిస్తున్న ఉద్యోగులు

అమలాపురం రూరల్: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించి కృష్ణా జిల్లా పామర్రుకు బదిలీ అయిన పరమట శ్రీపల్లవిని స్థానిక సత్యనారాయణ గార్డెన్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. సత్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ జేఏసీ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్ మాట్లాడుతూ తహసీల్దార్ శ్రీపల్లవి సేవలు అభినందనీయమన్నారు. బదిలీపై వెళుతున్న శ్రీపల్లవి మళ్లీ డిప్యూటీ కలెక్టర్ హోదాలో పదోన్నతిపై జిల్లాకు తిరిగి రావాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీపల్లవిని కార్యాలయ ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు, విలేజ్ సర్వేయర్లు, సర్పంచ్‌లు అభినందించారు. కార్యక్రమంలో డీటీ అడపా సుబ్రహ్మణ్యం, ఆర్ఐ బాలసరస్వతి, వీర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సాధనల ఎల్లేశ్వరరావు, వీఆర్వోలు గణేష్, రాజేష్, రాము, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తాళ్లరేవు మండలం సుంకటరేవుకు చెందిన యువకుడు దడాల అమర్ తేజ (26) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసుల వివరాల ప్రకారం కాకినాడలో ఆస్పత్రికి అమర్ తేజ తన తండ్రి ఈశ్వరరావుతో మోటారు సైకిల్‌పై వచ్చాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో తండ్రి బైక్ నడుపుతుండగా వెనక అమర్ తేజ కూర్చున్నాడు. తూరంగిలో బాలయోగి విగ్రహానికి సమీపానికి వచ్చే సరికి ఒక్కసారిగా కుక్క బైక్‌కు అడ్డం రావడంతో ఇద్దరూ కింద పడిపోయారు. అమర్‌తేజ తలకు బలమైన గాయం కావడంతో జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెండడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై భీష్మకుమార్ ఆదివారం తెలియజేశారు.

చొల్లంగి సాల్ట్ భూములు స్థానికులకే ఇవ్వాలి



చొల్లంగి భూములు స్థానిక లబ్ధిదారులకే కేటాయించాలంటూ ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగిలో 47/3 సర్వే నెంబరులోని సాల్ట్ భూములను కాకినాడ వాసులకు కేటాయించడం సరికాదని, ఆ భూములను స్థానికులకే ఇవ్వాలని కోరుతూ గ్రామస్తులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో చొల్లంగి భూములను స్థానికులకే ఇవ్వాలని నినాదాలు చేశారు. ఇదే డిమాండ్‌తో స్థానికులు కొద్దిరోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ చొల్లంగి గ్రామ లబ్ధిదారులకు పటవల, జి.వేమవరంలో ఇచ్చి చొల్లంగిలో ఉన్న భూములను మాత్రం కాకినాడ వాసులకు కేటాయించడం దారుణమన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చొల్లంగిలో భూములను స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

పౌర హక్కులతోనే సమ సమాజం



సభలో ప్రసంగిస్తున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

అమలాపురం టౌన్: పౌర హక్కుల అమలుతోనే సమ సమాజం ఆవిష్కృతమవుతుందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పౌర హక్కుల సంఘం 17వ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్‌లు ‘పౌర హక్కుల సంఘం 50 వసంతాల ప్రస్థానం’ అనే అంశంపై ఉపన్యసించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జిల్లెళ్ల మనోహర్, సీనియర్ న్యాయవాది డీబీ లోక్, కన్వీనర్ ఓగూరి బాలాజీ, రాష్ట్ర కార్యదర్శి ఏడిద రాజేష్, దళిత బహుజన మహిళా శక్తి సంఘం జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం



తాళ్లరేవులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



గొల్లవిల్లిలో దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు అమృతవల్లి

తాళ్లరేవు: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించాలన్నదే నవభారత్ గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమని ట్రస్ట్ చైర్మన్ అంగాడి రేవతి తెలిపారు. ఆదివారం తాళ్లరేవు అంబేడ్కర్ భవన్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడ అపోలో ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సాజిత్ కిషన్(కార్డియాలజిస్ట్), వంశీ చైతన్య(గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్), అనూష చౌదరి(జనరల్ మెడిసిన్), అభిషేక్ రావూరి, ఆశా ఐశ్వర్య(డెంటల్ సర్జన్‌లు) సుమారు 500 మందికి వైద్య సేవలందించారు. జనరల్ చెకప్ బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కంటి, చెవి, డెంటల్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులతో పాటు స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అల్లవరం: బోడసకుర్రు టిడ్కో భవన సముదాయంలో మీనాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మామిడికుదురుకు చెందిన అంజు కంటి ఆస్పత్రి వైద్యులు ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ తేజ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ వలీ, వైఎస్సార్ సీపీ టౌన్ అధ్యక్షులు సంసాని బులినాని, టిడ్కో అభివృద్ధి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లిలో అమలాపురం శ్రీనవ్య దంత వైద్యశాల అధినేత డాక్టర్ వంటెద్దు అమృతవల్లి ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ అమృతవల్లి సుమారు 100 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వీరితో పాటు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు వి.శాంభవి, టి.సమన్వితలు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్న నాయుడు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, పీఎంసీ చైర్మన్ దొనిపాటి రమా వెంకటరమణ, సుంకర బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

ఉప్పలగుప్తం: మండలంలోని సరిపల్లి పంచాయతీ కార్యాలయంలో శ్రీహరి హాస్పిటల్, అనిల్ ఆర్థో అండ్ ప్లాస్టిక్ సర్జరీ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ గెద్దం స్వరూపరాణి ప్రారంభించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు శ్రీహరి రాయలు, పావని, అనిల్ కుమార్, నీలిమలు సుమారు 250 మంది రోగులను పరీక్షించారు. మాజీ సర్పంచ్ గెద్దం సురేష్‌బాబు రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.


పొళ్లమ్మ ఆలయ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రథసారథి శ్రీరామ్మూర్తి

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పొళ్లమ్మ ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం పునః నిర్మాణ సారథి యెరుబండి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని శ్రీరామ్మూర్తి తెలిపారు. 20వ తేదీ మంగళవారం ఉదయం 10.34 గంటలకు పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 21వ తేదీ అమ్మవారి ఊరేగింపు, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 22వ తేదీ గురువారం ఉదయం 11.53 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని చెప్పారు. 23వ తేదీ సామూహిక కుంకుమార్చన ఏర్పాటు చేశామన్నారు. కరపత్రాల ఆవిష్కరణ అనంతరం అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు కరపత్రాలను అందించారు. పునః ప్రతిష్ఠా మహోత్సవాలకు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పరిశీలన



ముంగండ సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

పి.గన్నవరం: జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తపేట ఆర్డీఓ డీవీవీ సత్యనారాయణ ఆదేశించారు. ముంగండ గ్రామ సచివాలయంలో ఆదివారం జరిగిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, వీఆర్వోలు దొరబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరం గ్రామ సచివాలయంలో ఆదివారం జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. వీఆర్వో తోట శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కుంపట్ల పోలరాజు, సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు.